

**చీనీ టన్ను రూ.20 వేలు**
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.5 వేలు, సరాసరిన రూ.14,100 ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.14**
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.8, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
**31.7°/08.9°**
జిల్లా వ్యాప్తంగా బుధవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### డీఎస్పీ హేమంత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ వి.రత్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

**ధర్మవరం అర్బన్:** ధర్మవరం సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా హేమంత్‌కుమార్ బుధవారం ఉదయం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం పుట్టపర్తికి వెళ్లి ఎస్పీ వి.రత్నను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హేమంత్‌కుమార్ గతంలో తాడిపత్రిలో ట్రైనీ డీఎస్పీగా పనిచేశారు. విజయనగరం గ్రేహౌండ్స్‌లో డీఎస్పీ (ప్రొబేషన్)గా పనిచేస్తున్న ఆయన్ను...ప్రభుత్వం ఇటీవలే ధర్మవరం డీఎస్పీగా బదిలీ చేయడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడున్న డీఎస్పీ ఉన్న శ్రీనివాసులు మంగళగిరి హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు.

### లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఏఓ వైవీ సుబ్బారావు

**నల్లమాడ:** లాభసాటి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు సూచించారు. నల్లమాడ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం వ్యవసాయ శాఖ, ఎఫ్‌పీఓ సంయుక్త ఆధ్వర్యంలో 'పొలంబడి'పై రైతులకు శిక్షణ నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించి సీడ్ సర్టిఫికేషన్ పొందే రైతులుగా మారాలని, తద్వారా మార్కెట్‌లో అధిక రాబడి కూడా పొందవచ్చన్నారు. వ్యవసాయంలో డ్రోన్‌ల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలను వివరించారు. అనంతరం వేరుశనగ విత్తన స్టాల్‌ను పరిశీలించారు. సీడ్ సర్టిఫికేషన్ అధికారి డాక్టర్ రవి మాట్లాడుతూ, విత్తన సాగు నుంచి మార్కెట్‌లో విక్రయం వరకు రైతులు పాటించాల్సిన పద్ధతులు, మార్కెటింగ్‌లో మెలకువల గురించి తెలియజేశారు. పంటల సాగులో రైతులు మరింత మేలైన పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు సత్యనారాయణ, సనావుల్లా, నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాల వ్యవసాయాధికారులు, ఎఫ్‌పీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# మోతాదు పెంచి.. రైతును ముంచి!



మామిడి మొక్కలకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

- రైతులకు ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకుల ఉచిత సలహాలు
- ధనార్జనే ధ్యేయంగా పురుగు మందులు అంటగడుతున్న వైనం
- వ్యవసాయాధికారులు సూచించిన మందులకు అదనంగా మరికొన్ని
- పురుగు మందుల అతి వినియోగంతో పంటలకు చేటు
- దిగుబడి తగ్గి.. పెట్టుబడి పెరిగి నష్టాల పాలవుతున్న రైతులు

**95,564** హెక్టార్లు
జిల్లా రబీసాగు విస్తీర్ణం (వ్యవసాయ, ఉద్యాన పంటలు)

**రూ.143.33** కోట్లు
ఎరువులు, పురుగు మందుల కోసం చేస్తున్న ఖర్చు

**రూ.210** కోట్లు
ఫర్టిలైజర్స్ నిర్వాహకుల మాటలు విని రైతుల వాడే పురుగు మందుల ఖర్చు

**260**
జిల్లాలో అనుమతులు పొందిన ఫర్టిలైజర్ దుకాణాలు

- కదిరికి చెందిన గోవిందప్ప వేరుశనగ పంటకు తెగుళ్లు సోకగా వ్యవసాయాధికారులను సంప్రదించాడు. వారు సూచించిన పురుగుమందులు కొనేందుకు ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్తే.. దుకాణం యజమాని తెగుళ్ల నివారణతో పాటు దిగుబడికి, చెట్టు పెరిగేందుకు, పూత వచ్చేందుకు అంటూ వివిధ రకాల పురుగుమందులు అంటగట్టి సుమారు రూ.15 వేలు బిల్లు వేశాడు. వ్యవసాయాధికారి చెప్పింది ఒకటే కదా అంటే.. 'ఇవన్నీ వాడితే మంచిది. పంట దెబ్బతింటే ఇబ్బంది పడతారు' అని చెప్పేసరికి గోవిందప్ప ఆ మందులన్నీ కొన్నాడు. ఫలితంగా రూ.4 వేలయ్యే పురుగు మందుల ఖర్చు రూ.15 వేలు దాటి పోయింది.
- కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన రైతు రఘునాథ్ రబీ సీజన్ కింద కళింగర సాగు చేశాడు. ఓ ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి మూడు ఎకరాల్లో కళింగర సాగుకు ఎరువులు కావాలన్నాడు. అతను ఏకంగా 7, 8 రకాల ఎరువులు భూమిలోకి వేయడానికి ఇచ్చి సుమారు రూ.20 వేలకుపైగా బిల్లు వేశాడు. విత్తనం నాటాక 10 రోజుల మొక్కలకు మందులు పిచికారీ చేయాల్సి రాగా, రూ.8 వేలు బిల్లు వేశాడు. ఇలా పంట చేతికొచ్చే వరకూ ఇష్టానుసారం పురుగుమందులు వాడాడు. ఫలితంగా పెట్టుబడి భారీగా పెరిగిపోయి...తీవ్రంగా నష్టోయాడు.



హిందూపురంలోని ఓ ఫర్టిలైజర్ షాపు



మిరప పంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

**పుట్టపర్తి అర్బన్:** సాగులో ఉచిత సలహాలిచ్చేవారు ఎక్కువయ్యారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్న కొందరు ఫర్టిలైజర్ షాపుల యజమానులు దిగుబడి ఆశ జూపి అదనంగా పురుగు మందులు అంటగడుతున్నారు. దీంతో పెట్టుబడులు భారీగా పెరిగిపోవడంతో రైతులు నిండా మునిగిపోతున్నారు. పైగా అతిగా పురుగుమందులు వాడటం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఫలితంగా ఆ తర్వాత వేసిన పంటలూ దారుణంగా దెబ్బతింటున్నాయి. ఆయా భూముల్లో పండిన పంటలు విషతుల్యమవుతున్నాయి.

**వాతావరణ మార్పులతో పంటలకు తెగుళ్లు..**
జిల్లాలో రైతులు రబీలో 31,205 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 64,359 హెక్టార్లతో ఉద్యాన పంటలు సాగుచేస్తున్నారు. ఒక్క రబీ సీజన్‌లోనే తెగుళ్లనివారణ, దిగుబడి పెరగడం కోసం రూ.350 కోట్లకుపైగా విలువైన ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి నవంబర్ మధ్యలో ముగుస్తుంది. అప్పటికే రుతుపవనాలు తిరోగమనంలో ఉండటంతో తుపాను ప్రభావం అంతగా ఉండదు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ ముగిసినా జనవరి నెలలో సైతం ఆకాశం మేఘావృతం కావడం, అక్కడక్కడా జల్లులు కురవడం వంటి అనూహ్య పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రబీ పంటలకు చీడ పీడలు అధికమయ్యాయి. ముఖ్యంగా వేరుశనగ, మొక్కజొన్న, వరి, సజ్జ, పంటలతో పాటు ఉద్యానపంటలైన కళింగర, దోస, ఖర్బూజా, మామిడి, చీనీ, జామ, దానిమ్మ, కూరగాయల పంటలకూ తెగుళ్లు ఎక్కువయ్యాయి. దీంతో రైతులు ఒక్కో పంటకు కనీసం నాలుగైదు సార్లు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. అలాగే పంట సాగుకు ముందు గడ్డిమందు, దిగుబడి పెరగడానికి మందు అంటూ ఇష్టానుసారం పురుగు మందులు కొడుతున్నారు.

**ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుల ఇష్టారాజ్యం..**
తెగుళ్లు, చీడల నివారణ కోసం కొందరు రైతులు వ్యవసాయాధికారులను సంప్రదిస్తుండగా.. మరి కొందరు మాత్రం నేరుగా ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులను సలహా అడుగుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కొందరు ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు రైతులకు వివిధ రకాల మందులు అంటగడుతున్నారు. వ్యవసాయాధికారులు సూచించిన మందులతో పాటు దిగుబడి పెరుగుతుందని రైతులకు ఆశలు కల్పించి మోతాదుమించి రసాయన మందులు ఇస్తున్నారు. దీనివల్ల పెట్టుబడులు పెరుగుతున్నాయి. మరోవైపు ఇష్టానుసారం పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల భూసారం తగ్గి దిగుబడి తగ్గిపోతోంది.

### ఖర్చు పెరిగింది



వ్యవసాయాధికారులు అందుబాటులో లేకపోవడంతో ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులను ఆశ్రయిస్తున్నాం. వారి సూచన మేరకు పురుగు మందులను పంటలపై పిచికారీ చేస్తున్నాం. ధనార్జనే ధ్యేయంగా ఫర్టిలైజర్ షాపుల వారు వివిధ రకాల పురుగుమందులు అంటగడుతున్నారు. ఫలితంగా ఖర్చు బాగా పెరిగింది. పంట దిగుబడి మాత్రం పెరగలేదు.

– జనార్దన్, రైతు, పుట్టపర్తి

### ఇష్టానుసారం వాడకూడదు



ఏ పంటకైనా తెగుళ్లు సోకినప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలి. అధికారులు పొలం వద్దకు రాలేనప్పుడు తెగులు సోకిన మొక్కను తీసుకువెళ్తే తగు సలహాలు, సూచనలు ఇస్తారు. ఆ మేరకే పురుగు మందులు వాడాలి. అలాకాకుండా సొంతంగా ఇష్టానుసారం పంటపై మందులు పిచికారీ చేస్తే పంటలు దెబ్బ తినడంతో పాటు భూసారం తగ్గిపోతుంది.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# మా గోడు పట్టదా బాలయ్యా?

- ఇంటి పట్టాల కోసం బాలకృష్ణ ఇంటి వద్దకు భారీగా వచ్చిన మహిళలు
- 'డాకు' ఫంక్షన్ కోసం హడావుడిగా వెళ్లిపోయిన ఎమ్మెల్యే
- బాలకృష్ణ తీరుపై మహిళల మండిపాటు
- ఓటేసిన మమ్మల్ని పట్టించుకోకుండా విజయోత్సవాలేంటని ఆగ్రహం



అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన మహిళలను దాటుకుని కాన్వాయ్‌లో వెళ్లిపోతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

**హిందూపురం అర్బన్ :** ఎప్పుడో చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వచ్చే ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రజల గోడు పట్టించుకోవడం లేదు. వారే వచ్చి అర్జీలిద్దామనుకున్నా అవకాశం కల్పించడం లేదు. తాజాగా బుధవారం ఇళ్లు లేని నిరుపేద మహిళలు వందలాది మంది ప్రజా సంఘాల నేతలతో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటికి వద్దకు వచ్చారు. అర్జీలు పట్టుకుని గంటల తరబడి ఎదురు చూశారు. అయినా ఫలితం లేకపోయింది. ఎమ్మెల్యే బాలకృష్ణ వారిని కనీసం పట్టించుకోకుండా 'డాకు మహారాజ్' విజయోత్సవంలో పాల్గొనేందుకు అనంతపురం వెళ్లిపోయారు. ఆ వెంటనే అక్కడే ఉన్న టీడీపీ నేతలు మహిళలను అక్కడి నుంచి గెంటేశారు. దీనిపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తమ ఇళ్ల వద్దకు వచ్చి వంగివంగి దండాలు పెట్టిన బాలకృష్ణకు..ఇప్పుడు తమ బాగోగులు పట్టించుకునే తీరికే లేకుండా పోయిందన్నారు. ప్రజా సమస్యలకన్నా ఆయనకు సినిమా విజయోత్సవాలే ప్రధానమయ్యాయని, అలాంటప్పుడు ఇక్కడి నుంచి ఎందుకు పోటీ చేశారని ప్రశ్నించారు. కనీసం తాము తెచ్చిన అర్జీలు కూడా తీసుకోలేనంత బిజీగా ఉన్న ప్రజాప్రతినిధి తమకు వద్దని, తగిన సమయంలో ఆయనకు తప్పక గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహులు, రమణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు బాబావలి, ఇళ్ల స్థలాల పోరాట నాయకులు రాయుడు, సరస్వతి, గంగమ్మ, ఆదిలక్ష్మి, రామాంజినప్ప ఉన్నారు.

# 31 వరకూ పశు ఆరోగ్య శిబిరాలు



పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

**ప్రశాంతి నిలయం:** పాడిపశువుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించడానికి, పశు పోషణ ఖర్చు తగ్గించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ క్రమంలోనే పశు ఆరోగ్య శిబిరాల నిర్వహిస్తోందన్నారు. జిల్లాలోని 32 మండలాల్లో పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణకు మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బృందంలో పశు వైద్యుడు, పారా వెటర్నరీ సిబ్బంది, పశువైద్య సహాయకుడు, గోపాల మిత్ర ఉంటారన్నారు. వీరంతా ఆయా గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి పాడిపశువులకు వైద్య చికిత్సలు అందించడంతోపాటు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తారన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శుభదాస్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనారోగ్యంగా ఉన్న జీవాలతో పాటు పశువులకూ చికిత్స అందిస్తామన్నారు. పశు ఆరోగ్య శిబిరాల గురించి రైతులకు తెలియజెప్పేందుకు ప్రచారం ముమ్మరం చేశామన్నారు. కార్యక్రమంలో పశు వైద్యుడు డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చలికి 'పట్టు' తప్పుతోంది

తళుక్కున మెరవాల్సిన 'పట్టు'..మార్కెట్‌లో వెలవెలబోతోంది. చలి తీవ్రతకు పట్టుగూళ్లకు సన్నపుకట్టు తెగులు సోకుతుండగా నాణ్యత తగ్గి ధరపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పట్టు గూళ్లు ఉత్పత్తి చేసిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు.



హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన పట్టుగూళ్లు

- ఉష్ణోగ్రతలు తగ్గడంతో పట్టుగూళ్లకు సున్నపుకట్టు తెగులు
- దిగుబడులు, నాణ్యతపై తీవ్ర ప్రభావం
- మార్కెట్‌లో ఆశించిన ధర లేక తీవ్రంగా నష్టపోతున్న రైతులు

**హిందూపురం:** పట్టుగూళ్ల మార్కెట్‌కు హిందూపురం ఆసియాలోనే పేరుగాంచింది. మిగతా మార్కెట్లతో పోలిస్తే అధిక ధరలు దక్కుతుండటంతో హిందూపురం, మడకశిర, గుడిబండ, సోమందేపల్లి, లేపాక్షితోపాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా వందలాది మంది రైతులు పట్టుగూళ్లను ఇక్కడి తీసుకువచ్చి విక్రయాలు చేస్తుంటారు. అందువల్లే హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు రోజూ 6 వేల క్వింటాళ్లకుపైగా పట్టుగూళ్లు వస్తుంటాయి. కానీ ప్రస్తుతం పట్టుగూళ్ల ఉత్పత్తిపై చలి ప్రభావం తీవ్రంగా చూపుతోంది. అంతేకాకుండా పట్టుగూళ్లకు సున్నపుకట్టు తెగులు సోకడంతో దిగుబడి తగ్గుతోంది. ప్రస్తుతం మార్కెట్‌కు 3 వేల క్వింటాళ్లలోపే పట్టుగూళ్లు వస్తున్నాయి.

**ముందుకురాని రీలర్లు**
దిగుబడి అంతంతమాత్రమే ఉండగా మార్కెట్‌లో మంచి ధర పలకాలి. కానీ పట్టుగూళ్ల కొనుగోళ్లకు రీలర్లు ముందుకురాకపోవడంతో ఆశించిన ధరలు రావడం లేదు. ఓ రీలర్ టెండర్ వేస్తే దాన్ని మించి కనీసం రూ.5 ఇచ్చేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. ఈనెల 15వ తేదీన కిలో బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు రూ.750 పలకగా, కనిష్టంగా రూ.552 మాత్రమే పలికాయి. అలాగే 19 తేదీన గరిష్ఠంగా రూ.744, కనిష్ఠంగా రూ.567, 20న గరిష్ఠంగా రూ.751, కనిష్ఠంగా రూ.620, 21వతేదీన కిలో గరిష్ఠంగా రూ.748, కనిష్టంగా రూ.544 మాత్రమే పలికాయి. దీంతో ఎంతో ఆశతో ఇక్కడివరకూ వస్తున్న రైతులు కనీసం రవాణా చార్జీలు దక్కక నష్టాలపాలవుతున్నారు.

**ఉష్ణోగ్రత తగ్గకుండానే చూసుకోవాలి**
పట్టుగూళ్లు షెడ్లలో ఉష్ణగ్రతలు తగ్గకుండా చూసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే పట్టుగూళ్లు సున్నపుకట్టు బారిన పడి దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు. షెడ్లులో రాత్రిళ్లు కనీసం 20 డిగ్రీలు తగ్గకుండా ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. కొందరు రైతులు షెడ్లలో వేడికోసం 200 వాల్టల బల్బులు పెడుతున్నాని, దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. షెడ్లలో బొగ్గుల కుంపటి లేదా హీటర్లు పెట్టి వేడిని పెంచుకోవాలని సూచించారు. అలాగే మార్కెట్‌కు గూళ్లు తెచ్చే ముందు కూడా ఆ రోజు చివరగా అల్లిన గుడ్డులో పురుగు ప్యూపా అయిందో లేదో గుడ్డును చాకుతో కోసి చూసి పూర్తిగా ప్యూపా దశలో ఉంటేనే మార్కెట్‌కు తీసుకువస్తే ఆశించిన ధర లభిస్తుందని చెబుతున్నారు.

### ధర పెరిగితేనే గిట్టుబాటు



చలి ప్రభావంతో పట్టుగూళ్ల ఉత్పత్తి చాలా ఇబ్బందికరంగా మారుతోంది. వ్యయప్రసాల కోర్చి గూళ్లను మార్కెట్‌కు తీసుకువస్తే సరైన ధర **దక్కక నష్ట పోవాల్సి** వస్తోంది. ప్రస్తుత 'పురం' మార్కెట్‌లో క్వింటా బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు రూ.700 వరకు పలుకుతున్నాయి. క్వింటా కనీసం రూ.800పైగా పలికితే నష్టాలు ఉండవు. లేకపోతే రైతుల రెక్కల కష్టం వృథా కావడం ఖాయం.

– వీరాంజినేయ, పావగడ

### రీలర్లు ముందుకు రావడం లేదు



పట్టుగూళ్ల కొనుగోలుకు రీలర్లు ముందుకు రావడం లేదు. ఒక రీలర్ టెండరు వేస్తే దాని పైన రూ.5 పెంచేందుకు కూడా ఎవరూ ముందుకు **రావడం లేదు.** వ్యయ ప్రయాసల కోర్చి పట్టుగూళ్లను మార్కెట్‌కు తెస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. కనీసం క్వింటా పట్టుగూళ్లు రూ.750పైబడి పలికితే రైతులకు ఇబ్బందులు ఉండవు. ప్రసుత్తం ఆ మేర ధర పలకడం లేదు.

– హర్షవర్ధన్‌రెడ్డి, వైటీ హళ్లి



సున్నపుకట్టు తెగులు సోకిన గూళ్లు (ఇన్‌సెట్‌లో) నాణ్యతగా ఉన్న గూళ్లలో పట్టుపురుగులు

## క్లుప్తంగా

### వాచ్‌మెన్ అనుమానాస్పద మృతి



వారాదప్ప మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**ధర్మవరం అర్బన్:** స్థానిక ప్రియాంకనగర్ ఎదురుగా ఉన్న గ్రానైట్ షాపు వద్ద బుధవారం వాచ్‌మెన్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లికి చెందిన వారాదప్ప(68) గ్రానైట్ షాపులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య కృష్ణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం తెల్లవారుజామున గ్రానైట్ బండల వద్ద విగత జీవిగా కనిపించాడు. గమనించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి గుండెపోటుతో మృతి చెందాడా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

### దానిమ్మ తోటకు నిప్పు



మంటలు ఆర్పుతున్న దృశ్యం

**మడకశిరరూరల్:** మండలంలోని రేకులకుంట సమీపంలో రైతు అశ్వర్థనారాయణ సాగు చేసిన దానిమ్మ తోటకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేలోపు దాదాపు 2,500 చెట్లు కాలి బూడిదయ్యాయి. జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి పరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

### ప్రిన్సిపాల్ ఆకస్మిక మృతి



హరీంద్రప్రసాద్ (ఫైల్)

**కదిరి అర్బన్:** స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరీంద్రప్రసాద్(59) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం విధులకు హాజరైన ఆయన గుండెలో నొప్పిగా ఉందంటూ మధ్యాహ్నం భోజనానికి అరగంట ముందే తన స్వగృహానికి వెళ్లారు. అక్కడ నొప్పి ఎక్కువ కావడంతో స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతిచెందాడు. కాగా, హరీంద్రప్రసాద్ స్వగ్రామం నంద్యాల మండలం చాగలమర్రి. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు.





పురాతన వస్తువులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్‌ఎం సుధాకర్ తదితరులు, ఆసక్తిగా గమనిస్తున్న విద్యార్థులు



పాత కాలం నాటి వివిధ రకాల టెలిస్కోప్‌లు



దశాబ్దాల క్రితం నాటి రేడియోలు, ట్రాన్సిస్టర్లు, టేప్ రికార్డులు, ప్రొజెక్టర్లు

## • అబ్బుర పరుస్తున్న ప్రదర్శన

**గుంతకల్లు:** స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పురాతన వస్తు ప్రదర్శన సందర్శకులను అబ్బుర పరుస్తోంది. రాయలసీమ ది నుమిస్మాటిక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను బుధవారం డీఆర్‌ఎం సి.చంద్రశేఖర్‌గుప్తా, ఏడీఆర్‌ఎం సుధాకర్ ప్రారంభించారు. ద్వాపర యుగం నాటి నాణేలు మొదలు ఇప్పటి వరకూ వినియోగంలో ఉన్న 250 దేశాల కరెన్సీ, స్టాంప్‌లు, రాయలు, కుషాణులు, శాతవాహనులు, చోళులు, దేవగిరి తదితర రాజుల కాలంలో వినియోగించిన గృహోపకరణాలు, పురాతన కెమెరాలు, టెలిస్కోప్‌లు, స్లైడ్ ప్రాజెక్టర్లు, రేడియోలు, సౌండ్ సిస్టం తదితరాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బొగ్గు రైలింజన్ నుంచి ప్రస్తుత విద్యుత్ రైలింజన్ల నమూనాలు, మారిన రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థనూ ప్రదర్శనలో ఉంచారు. ప్రతి వస్తువునూ వందలాది మంది విద్యార్థులు ఆసక్తిగా గమనించి, వాటి ఉపయోగం, పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోవిందరాజులుగుప్తా, ఐఎం ఫెర్నాండేజ్, డీసీ శేఖర్, రాధాస్వామి, దుర్గాచరణ్, నాగేంద్రబాబు, ప్రబ్విన్ సాయి, అరవింద్ ఆచార్య, శివప్రసాద్, సాయిదీప్, ప్రభాకర్, అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'డాకు మహారాజ్' విజయోత్సవం



అభిమానులకు అభివాదం చేస్తున్న సినీహీరో బాలకృష్ణ, చిత్రంలో డైరెక్టర్ బాబీ, హీరోయిన్స్

**అనంతపురం:** నగరంలో బుధవారం 'డాకు మహారాజ్' చిత్ర విజయోత్సవం ఘనంగా జరిగింది. అభిమాన నటీనటులను చూసి అభిమానుల్లో ఆనందం నెలకొంది. డాకు మహారాజ్ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 12వ తేదీ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అనంతపురంలో చిత్ర విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తాను దైవాన్ని నమ్ముతానన్నారు. తల్లిదండ్రులు, కళామతల్లి ఆశీర్వాదంతో వరుసగా నాలుగో విజయం సాధించానన్నారు. ప్రతి సినిమాను ఒక ఛాలెంజ్‌గా తీసుకుని నటిస్తానన్నారు.

### సందడి చేసిన సినీ తారలు..

డాకు మహారాజ్ చిత్రంలో నటించిన నటీనటుల రాకతో నగరంలో సందడి నెలకొంది. విజయోత్సవ కార్యక్రమంలో ప్రేక్షకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్ర దర్శకుడు బాబీ, హీరోయిన్లు ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి, ఊర్వశి రౌతేలా పాల్గొన్నారు.



హాజరైన అభిమానులు

### పోక్సో కేసు నమోదు

**రొళ్ల:** బాలికకు మాయ మాటలు చెప్పి తన వెంట పిలుచుకెళ్లిన కేసులో యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల వయసున్న బాలిక ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఘటనపై ఈ నెల 4న తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఇంటికి చేరుకున్న బాలిక బుధవారం పోలీసులకు తన వాంగ్మూలాన్ని ఇచ్చింది. రొళ్ల మండలం ఆర్.వడ్రహట్టికి చెందిన ధనరాజ్ కుమారుడు కిరణ్ ఈ నెల 2న తను ఇంటి నుంచి బలవంతంగా పిలుచుకెళ్లి కర్ణాటకలోని శిడ్లఘట్ట తాలూకా దిబ్బురహళ్లి గ్రామంలోని ఓ ఇంట్లో ఉంచి అత్యాచారం చేసినట్లుగా తెలిపింది. అతి కష్టంపై అక్కడి నుంచి తాను తప్పించుకుని వచ్చినట్లుగా పేర్కొంది. దీంతో కిరణ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలింపు చేపట్టినట్లు ఏఎస్ఐ బాలాజి తెలిపారు.

## పీఆర్సీని తక్షణమే ప్రకటించాలి



కలెక్టర్ చేతన్‌కు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

**ప్రశాంతి నిలయం:** ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... 2023, జూలై 1 నుంచి అమలు కావాల్సిన 12వ పే రివిజన్ కమిషన్‌ను నేటికీ నియమించక పోవడం బాధాకరమన్నారు. 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు, డీఏ బకాయిలు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్ బకాయిలు, సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలు, ఏపీజీఎల్ఐ బకాయిలు, చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ ఇచ్చి 2004 తర్వాత నియామకం పొందిన 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.సుధాకర్, కార్యదర్శులు లక్ష్మీనారాయణ,శివ, నారాయణ స్వామి, నరేష్ కుమార్, బాబు, రవీంద్రనాథ్, రామాంజినేయులు, క్రిష్టప్ప, సురేష్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ బంగారం విక్రేతల అరెస్ట్

- రూ.21 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**సోమందేపల్లి:** తక్కువ ధరకే మేలిమి బంగారాన్ని అందజేస్తామని నమ్మబలికి నకిలీ బంగారం అంటగట్టి డబ్బుతో ఉడాయించిన కేసులో పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రాణా కృష్ణబాబు, కర్ణాటకకు చెందిన శాంతరాజు, నయాజ్ అహమ్మద్, ఈరన్న, బాబు, అర్జున్, ఆనంద్‌బాబు, బంగారి, ఈడిగ హరిప్రసాద్ ఓ ముఠాగా ఏర్పడి నకిలీ బంగారం దందా చేపట్టారు. ఈ క్రమంలోనే నకిలీ బంగారపు పూసల దండలు సేకరించుకుని, అందులో కొన్ని మేలిమి బంగారం పూసలను చేర్చారు. అనంతరం కొనుగోలుదారులు పరీక్షించుకునే సమయంలో మేలిమి బంగారం పూసలను మాత్రమే చూపించేవారు. ఇటీవల అనంతపురం జిల్లా విడపనకల్లుకు చెందిన ఈశ్వరన్న, చిత్తూరు జిల్లా కుప్పం నివాసి ముని వెంకటేష్‌కు ముఠా సభ్యులు ఫోన్ చేసి మాట్లాడారు. తమకు తవ్వకాల్లో మేలిమి బంగారం లభ్యమైందని, తక్కువ ధరకే వాటిని విక్రయిస్తామని నమ్మబలికారు. వారి మాయలో చిక్కుకున్న ఇద్దరినీ ఈ నెల 9న సోమందేపల్లి బ్రాహ్మణపల్లి వద్దకు రప్పించుకున్నారు. తొలుత ఈశ్వరన్న వద్ద రూ.8 లక్షలు తీసుకున్నారు. అనంతరం ముని వెంకటేష్ వద్ద రూ.13 లక్షలు తీసుకుని ఇద్దరికీ నకిలీ బంగారం పూసల దండలు చేతిలో పెట్టి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించారు. కాసేపటి తర్వాత వాటిని పరిశీలించుకున్న ఈశ్వరన్న, ముని వెంకటేష్... అవి నకిలీవని నిర్ధారించుకుని వెంటనే సీఐ రాఘవన్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ రమేష్‌బాబు... బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలింపు చేపట్టి బుధవారం పక్కా ఆధారాలతో మొత్తం పది మందినీ అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.21 లక్షలతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేయబోతున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. తక్కువ మొత్తానికి బంగారం ఇస్తామని ఫోన్లు చేసి ఆశ చూపితే ఆకర్షణకు గురి కావద్దని ప్రజలకు సూచించారు.

## డి-ఫార్మసీలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్

**హిందూపురం:** స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఇన్ ఫార్మసీలో ఈ నెల 24వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హరీష్‌బాబు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సుకు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులు. 55 సీట్లకు గాను ఇప్పటికే 50 సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. మిగులు ఐదు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. ఓపెన్ కేటగిరీలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థినులు మాత్రమే అర్హులు. ఆసక్తి ఉన్న వారు రూ.6,300 ఫీజు, 10వ తరగతి, ఇంటర్ మార్క్స్ మెమో, ఒరిజినల్ టీసీ, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, 2024-25వ సంవత్సరానికి సంబంధించి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, రెండు ఫొటోలతోపాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ అన్నీ మూడు సెట్లుగా తీసుకుని 24వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలోని ఫార్మసీ విభాగానికి హాజరు కావాలి. పూర్తి వివరాలకు 97038 43680లో సంప్రదించవచ్చు.

## రెండు గ్రామాల్లో దొంగల బీభత్సం

**అమడగూరు:** రెండు గ్రామాల పరిధిలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఏకంగా పది బోరుబావులకు సంబంధించిన విద్యుత్ కేబులును అపహరించారు. వివరాలు... అమడగూరు మండలం చీకిరేవులపల్లి, శీతిరెడ్డిపల్లి గ్రామాల్లో నెల రోజుల క్రితం దొంగలు హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో పది బోరుబావులకు రైతులు ఏర్పాటు చేసుకున్న త్రీఫేజ్ కేబుల్‌ను అపహరించారు. దీంతో రైతులు కొత్త కేబుల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం రాత్రి తిరిగి చీకిరేవులపల్లికి చెందిన మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, కాసుల శ్రీరాములు, వెంకటరమణ, శివారెడ్డి, శీతిరెడ్డిపల్లికి చెందిన నాగకిషోర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి బోర్లకు ఏర్పాటు చేసిన నూతన కేబుల్‌ను అపహరించుకెళ్లారు. రెండు గ్రామాలకు చెందిన తాగునీటి పథకం బోరు బావులకు ఏర్పాటు చేసిన కేబుల్ అపహరణకు గురైంది. పంచాయతీ సర్పంచ్ సురేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## అట్టహాసంగా ప్రారంభమైన అల్ట్రా మారథాన్



మారథాన్‌ను ప్రారంభిస్తున్న మాంఛో ఫెర్రర్

**బెళుగుప్ప/అనంతపురం:** మండలంలోని వెంకటాద్రిపల్లి నుంచి 10వ అనంతపురం అల్ట్రా మారథాన్ రన్‌ను ప్రముఖులతో కలసి ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాంఛో ఫెర్రర్ మాట్లాడారు. వెంకటాద్రిపల్లి నుంచి సంస్థ కార్యకలాపాలను అప్పట్లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితోనే ఇక్కడి నుంచే 10వ అల్ట్రా మారథాన్ రన్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. 600 గ్రామాలను కలుపుతూ సుమారు 170 కిలోమీటర్ల మేర మారథాన్ కొనసాగి గురువారం మధ్యాహ్నం బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ ఘాట్ వద్ద ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో విశాలఫెర్రర్, మారథాన్ రన్నర్ జువాన్ మానువేల్, తదితరులు పాల్గొన్నారు.

**ముగింపు సభ నేడు**

**బత్తలపల్లి:** ఆర్డీటీ ఆధ్వర్యంలో గురువారం అల్ట్రా మారథాన్ ముగింపు సభ బత్తలపల్లిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీలకుమారి, ఏటీఎల్ రుక్మాంగద బుధవారం మీడియాకు వెల్లడించారు. ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి మీదుగా గురువారం ఉదయం బత్తలపల్లికి చేరుకున్న అనంతరం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద ముగింపుసభ ఉంటుందన్నారు.

## రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

**అనంతపురం:** ఎస్కే యూనివర్సిటీ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 25 నుంచి 30 రోజుల పాటు నిరుద్యోగ మహిళలకు కంప్యూటర్ ట్యాలీ కోర్సుపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ మహిళలు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలి. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 94925 83484లో సంప్రదించవచ్చు.

## సోనా... మోసపోయినా!

- సోనా మసూరి పేరుతో రేషన్ బియ్యాన్ని అంటగట్టిన మోసగాళ్లు
- గంట వ్యవధిలోనే రూ.2.50 లక్షలతో ఉడాయించిన వైనం
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు



బస్తాలో ఉన్న రేషన్ బియ్యం

**ఉరవకొండ:** తక్కువ ధరకే నాణ్యమైన సోనా మసూరి బియ్యం అంటూ నమ్మబలికిన కొందరు మోసగాళ్ల విసిరిన వలలో పలువురు మహిళలు చిక్కుకున్నారు. మోసాన్ని గుర్తించేలోపు దాదాపు రూ.2.50 లక్షలను పోగు చేసుకుని ఆగంతకులు ఉడాయించారు. వివరాలు... బుధవారం ఉదయం ఉరవకొండలోని 5, 6 వార్డులతో పాటు మల్లేశ్వర స్వామి ఆలయం, రంగావీధిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో నడుపుతూ తక్కువ ధరకే సోనా మసూరి బియ్యం అంటూ మహిళలను ఆకట్టుకున్నారు. మార్కెట్లో 50 కిలోల బస్తా రూ.4వేల వరకు ధర పలుకుతున్న సోనా మసూరి బియ్యాన్ని రూ.2,500కే ఇస్తామంటూ సాంపుల్ కింద కొంత తీసి చూపించారు. పరిశీలించి చూసిన పలువురు మహిళలు అవి సోనా మసూరి బియ్యమని నిర్ధారించుకుని ఒక్కొక్కరు రెండు, మూడు ప్యాకెట్లు చొప్పున కొనుగోలు చేశారు. మధ్యాహ్నం వంట చేసేందుకు బస్తాలను తెరిచి చూస్తే అందులో రేషన్ బియ్యం ఉండడం గమనించి అవాక్కయ్యారు. మొత్తం ఐదు వార్డుల్లో రూ.2.50 లక్షల మేర మహిళలకు కుచ్చుటోపీ వేసినట్లు బహిర్గతమైంది. జరిగిన మోసంపై కొందరు మహిళలు పరువు పోతుందని మౌనంగా ఉండగా, మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

## హోరాహోరీగా రాష్ట్ర స్థాయి వృషభాల బలప్రదర్శన

- విజేతగా నిలిచిన నంద్యాల జిల్లా వృషభాలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

**పామిడి:** స్థానిక కొండూరు మార్గంలో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మ గ్రామదేవతల 17వ జాతర సందర్భంగా రెండు రోజులుగా సాగుతున్న రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన హోరాహోరీగా సాగుతోంది. జాతర ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి ఫ్లడ్ వెలుగుల్లో న్యూ కేటగిరి వృషభాల బల ప్రదర్శన సాగింది. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 15 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన రైతు బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. 2వ స్థానంలో అదే జిల్లా ప్యాపిలి మండలం డి.రంగాపురం రైతు జూటూరు రామకృష్ణారెడ్డి వృషభాలు, 3 స్థానంలో అదే జిల్లా పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లి రైతు నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు, 4వ స్థానంలో అనంతపురం జిల్లా అక్కంపల్లి రైతు కోనేపల్లి ఇంద్రారెడ్డి వృషభాలు, 5వ స్థానంలో వైఎస్సార్ జిల్లా చెన్నూరు మండలం బలిసింగాయపల్లి రైతు మేడా వంశీరెడ్డి వృషభాలు, 6వ స్థానంలో అదే జిల్లా ఖాదర్‌ఖాన్ కొట్టాల గ్రామ రైతు డి.భావనశ్రీ వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు.